# కనుల పండువగా బతుకమ్మ వేడుకలు

- చెన్నూర్‌లో ఆడి పాడిన ఆడబిడ్డలు



చెన్నూర్ టౌన్ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 20 : చెన్నూర్ పట్టణంలోని పలు వీధుల్లో శుక్రవారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాలయంలో, పద్మనాయక సంఘంలో ఏర్పాటు చేసిన బతుకమ్మలను శుక్రవారం పట్టణంలోని పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం, మరికొన్ని ప్రాంతాల్లో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయమే వివిధ రకాల పూలు సేకరించి బతుకమ్మలను పేర్చారు. రాత్రి వరకు బతుకమ్మ ఆడిపాడారు. అనంతరం స్థానిక పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. నైవేద్యాలు పంచిపెట్టుకున్నారు.



చెన్నూర్ టౌన్ : అందంగా పేర్చిన బతుకమ్మలు

**మందమర్రిలో బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో..**

మందమర్రి, అక్టోబర్ 20: బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మందమర్రి పట్టణంలోని బీఆర్ఎస్ బీ1 కార్యాలయం వద్ద బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత స్వపరిపాలనలో బతుకమ్మ పండుగకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. అన్ని వర్గాలసంక్షేమానికి మళ్లీ బీఆర్ఎస్‌కు మద్దతు గా ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌నే గెలిపించాలని ప్రజలను కోరారు.



మందమర్రి : బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



బెల్లంపల్లి : దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి, అక్టోబర్ 20:బెల్లంపల్లి పట్టణంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆర్య వైశ్య కల్యాణ మండపం, 22వ వార్డు బూడిదగడ్డ బస్తీలో ప్రతిష్ఠించిన దుర్గామాతను శుక్రవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దర్శించుకున్నారు. పలు మండపాల వద్ద ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల జాతరలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గడ్డం అశోక్‌గౌడ్, దామెర శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, దుర్గామాత కమిటీ సభ్యులు దుర్గం రాజేష్, దుర్గం సురేశ్, వైద్యనాథ్, రాజ్‌కుమార్, పప్పు, చరణ్, మహిళా భక్తులు, వార్డు కమిటీ సభ్యులు, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.



కాసిపేట 2 ఇంక్లైన్ గనిపై అమ్మవారి దర్శనం చేసుకుంటున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, నాయకులు, కార్మికులు

**కాసిపేట మండలంలో..**

కాసిపేట, అక్టోబర్ 20 : కాసిపేట మండలంలోని ఆయా గ్రామాల్లో దుర్గామాత మండపాల వద్ద ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో స్వయంగా భక్తులకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వడ్డించారు. అనంతరం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు ఆయా నవరాత్రి ఉత్సవాల మండలి నిర్వాహకులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, అక్కెపల్లి లక్ష్మి, సర్పంచ్ రాంటెంకి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల కార్యదర్శి మోటూరి వేణు, గ్రామ అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, జాడి రాంచందర్, అక్కెపల్లి బుగ్గరాజు తదితరులు పాల్గొన్నారు.

**కాసిపేట 2 ఇంక్లైన్ గనిపై శాంతి హోమం**

మందమర్రి ఏరియాలోని కాసిపేట 2 ఇంక్లైన్ గనిపై మైసమ్మ తల్లి ఆలయంలో దేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అమ్మవారి శాంతి హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికల సంపత్, ఏజెంట్ రాందాస్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, సంక్షేమాధికారి భార్గవ్, సేఫ్టీ ఆఫీసర్ సంతోశ్ రావు, టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీ కారుకూరి తిరుపతి, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, కొత్తపల్లి ఉదయ్, పెద్ద సంఖ్యలో సింగరేణి అధికారులు, కార్మికులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సామూహిక అక్షరాభ్యాసం

తాండూర్, అక్టోబర్ 20 : మండలంలోని కొత్తపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో దుర్గా నవరాత్రుల సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మమత, స్వరూపారాణి ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ప్రమీళ, ఆయా లక్ష్మి, తల్లులు, కిశోర బాలికలు, పిల్లలు, గ్రామస్తులున్నారు.



కొత్తపల్లిలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న భక్తులు

## బాధిత కుటుంబానికి బాల్క ఫౌండేషన్ చేయూత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మందమర్రి, అక్టోబర్ 20: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో ఇటీవల అనారోగ్యంతో మరణించిన నీలం వెంకటమ్మ కుటుంబానికి బాల్క ఫౌండేషన్ చేయూతనందించింది. స్థానిక బీఆర్ఎస్ నాయకులు బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 వేల విలువైన బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను శుక్రవారం వెంకటమ్మ ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు కళ్లోజీ అనిల్, ప్రధాన కార్యదర్శి కట్ల మోహన్, మహిళా అధ్యక్షురాలు కుడికాల కల్పన, నాయకులు కనకయ్య, నర్సయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సర్వాయిపేటలో వైద్య శిబిరం

కోటపల్లి, అక్టోబర్ 20 : కోటపల్లి మండలం సర్వాయిపేట గ్రామంలో హెల్త్ అసిస్టెంట్ పబ్బ సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో డ్రై డే ఫ్రైడే నిర్వహించిన అనంతరం వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. జ్వర లక్షణాలున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్త లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణలు ఆపాలి

తాండూర్, అక్టోబర్ 20 : గతంలో తమకు దానం చేసిన భూమిని ప్రస్తుతం కొందరు ఆక్రమించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆ ఆక్రమణలను ఆపాలని కోరుతూ శుక్రవారం తాండూర్ గ్రామానికి చెందిన మాదిగ కులస్తులు తహసీల్దార్ డీ రోహిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాదిగ కులస్తులు మాట్లాడుతూ 630/1 సర్వే నంబర్‌లో భూమిని సంబంధిత భూమి యజమాని తులా వెంకటేశ్వర్‌రావు గతంలో మాదిగ కులస్తులకు దానంగా ఇచ్చారని తెలిపారు. ఆ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి చదును చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసిపేట శంకర్, ఇప్ప రాయమల్లు, ఇప్ప బుచ్చయ్య, కోరల్ల శంకర్, ఇప్ప మైసయ్య, మాదిగ కులస్తులు ఉన్నారు.

## ఆయిల్ పామ్ కోత ప్రారంభం

కోటపల్లి, అక్టోబర్ 20 : కోటపల్లి మండలం సర్వాయిపేటలో చెన్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బైస ప్రభాకర్ సాగు చేసిన ఆయిల్ పామ్ పంట కోతను ప్రారంభించారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సూచనల మేరకు మూడేళ్ల క్రితం పంటను సాగు చేయగా కోతకు వచ్చినట్లు ప్రభాకర్ వివరించారు. ఆయిల్ పామ్ పంట ద్వారా రైతులకు లాభాలు ఉన్నాయని, ప్రతి రైతూ పంట సాగు పై దృష్టి పెట్టాలన్నారు.

## ఎన్నికల సిబ్బందికి సహకరించాలి

వేమనపల్లి, అక్టోబర్ 20 : వేమనపల్లి మండలానికి వచ్చే ఎన్నికల సిబ్బందికి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో శ్రీపతి బాపురావు పేర్కొన్నారు. శుక్రవారం వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీకార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బంది రాత్రి బస చేయడానికి తగు ఏర్పాట్లు చేయాలని, తాగునీరు, విద్యుత్, ఫ్యాన్, టెంట్లు తదితర సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటింగ్ శాతం పెంచేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, టీఏలు, కార్యదర్శులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్ల పరిశీలన

తాండూర్, అక్టోబర్ 20 : నవంబర్ 30 న జరగనున్న సాధారణ ఎన్నికలు నేపథ్యంలో తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. తాండూర్ జడ్పీహెచ్ఎస్, ఎంపీయూపీఎస్, తాండూర్ ఉర్దూ జడ్పీహెచ్ఎస్‌లో కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో వసతులు, తాగునీటి సౌకర్యం, టాయిలెట్, విద్యుత్ సౌకర్యాలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శికి తగు సూచనలు చేశారు. మొబైల్ యాప్ తనిఖీలో భాగంగా పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. నర్సరీలో చదును చేసి ఎర్ర మట్టి వేయాలని సూచించారు. ఎంపీడీవో వెంట జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి తపాస్‌కుమార్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.